

# బలి

కప్పగంతుల మల్లికార్జునరావు

పోస్టుమేన్ అప్పుడే వచ్చి వెళ్ళేడు.

శ్రీధర్ ఆశించినట్లు ఆవేళ కూడా మనిఆర్డర్ రాలేదు. వచ్చే ఆశ కూడా పోయింది. తన బాధల్ని వివరించి ఎలాగోలా సర్దుకోమని రాశాడు తండ్రి.

తండ్రి బాధలు తనకు తెల్సు.

అయితే పరీక్ష ఫీజు ఎలా సర్దాలి? భోజనం, రూమ్ రెంట్, యింకా మిగతా ఖర్చులు అన్నీ తను సర్దుకొంటూనే వున్నాడు. అయితే మరో నాలుగురోజుల్లో పరీక్ష ఫీజు కట్టాలే. ఎలా?

స్కూటర్ హారన్ శబ్దం-

ఉత్తరాన్ని చటుక్కున పుస్తకాల మధ్య దాచాడు శ్రీధర్. మొహంలో సంతోషాన్ని పులుముకోటానికి ప్రయత్నించాడు.

సాధ్యంకాలేదేమో - మధుకు దొరికిపోయాడు.

"ఏరా అలా వున్నావ్? మీ నాన్న పంపించిన డబ్బు అయిపోయిందా ఏమిటి? అందుకే అయితే విచారం ఎందుకు? నేనున్నాగా? పద పద...."

మధు ధనవంతుడు. డబ్బును మంచి

పీళ్ళ ప్రాయంగా ఖర్చుచేయటం అతని హాబీ.

కొన్ని కారణాలవల్ల శ్రీధర్ యూని వర్సిటీలో లేట్‌గా జాయిన్ అయ్యాడు. ఫలితంగా హాస్టల్‌లో సీట్ చిక్కలేదు.

అసలే ధనహీనుడు అతను. పెద్ద చొరవ వున్నవాడు కూడా కాదు. పైగా యూనివర్సిటీ కొత్త. అది వున్న వూరు కొత్త. ఏం చెయ్యటం?

అతని సమస్యను ఎలా తెల్సు కొన్నాడో మధు అతని పాయానికి వచ్చాడు.

'బ్రదర్. నా పేరు మధు. యీవూరే. నీ క్లాస్‌మేట్‌ని. యింట్లో చదువు సాగ దని నేనో రూమ్ తీసుకొన్నాను. యూని వర్సిటీకి పెద్ద దూరమేం కాదు. నేను రూమ్‌మేట్‌కోసం ఎదురుచూస్తున్నాను. నీకు అభ్యంతరం లేకపోతే నా రూమ్‌లో వుండొచ్చు.'

శ్రీ ధ ర్ సంతోషించాడు. కానీ ప్రైవేట్ రూమ్. అద్దె ఎంతో? పైగా భోజనం, కాఫీ ఖర్చులు....తడిపి మోపె డంత కావూ?

'రూమ్‌కి అద్దె ఎంతండీ?'

'జస్ట్ నామినల్ రెంట్ పేచేస్తున్నాను. ఎందుకంటే ఆ యింటి యజమానులు మాకు తెల్సినవాళ్లే. మాతో అనేక పను లున్నవారే' అంటూ రెంట్ చెప్పాడు.

ఆ రెంట్‌లో సగం తను చెల్లించాలి. అంటే కారుచౌక.

అలా శ్రీధర్ మధుకు రూమ్‌మేట్ అయ్యాడు.

అయితే మధు అసలు రూ మ్ లో వుంటేనా? శ్రీధర్ రూమ్ అయిందది. మధు అప్పుడప్పుడు వచ్చే అతిధి అయ్యాడు.

మధుకు చదువు, డిగ్రీలు ప్రిస్టేజి సింబల్స్ మాత్రమే. తండ్రి చేతికింద వున్న పరిశ్రమలకు, వ్యాపారానికి అతడు ఏకైక వారసుడు. వాటి నిర్వహణకు అవసరమైన శిక్షణను తండ్రి యిస్తూనే వుంటాడు.

వ్యాపారసంబంధమైన లావాదేవీలలో మధు తెలివితేటలు అపారం. అయితే కాలేజీ చదువులంటే, పుస్తకాలంటే అతనికి అలెర్జీ క్లాసులో పాఠాలు వినట మంటే కరకాయ నోట్లో పెట్టుకొన్నట్లే.

అయినా అతనికి డిగ్రీలు కావాలి. అవి వున్నందువల్ల బిజినెస్‌లో ముందు ముందు చాలా లాభం.

అంచేత శ్రీధర్ సహాయం అతనికి అవసరం.

శ్రీధర్ మేధావి. గ్రహణశక్తి, ధారణశక్తి అద్భుతంగా వున్నవాడు. అయినా పేదరికం అనేది అతనికి శాప మయింది. ఎదగాల్సినంతగా ఎదగలేక పోయాడు.

మధు తనకి చేసే సహాయాలు చూస్తే శ్రీ ధ ర్ కి సిగ్గువేసేది. ఒక్కొకసారి దారిద్ర్యంవల్ల కళ్ళు వుబ్బికొచ్చేవి.

యితరుల దయాధర్మాలమీద బ్రత కటం - అలా బ్రతకవలసి రావటం - ఎంత హీనం? ఎంత దుర్భర విషయం? రోజులు - నెలలు కాదుకదా? సంవత్స రాల తరబడి అలా బ్రతకటం సాధ్యమా?

అందుకే ఆతనికి తను పరీక్షఫీజు కట్టేసినట్లు ముందుగానే చెప్పేశాడు శ్రీధర్. తండ్రి డబ్బు పంపించినట్లు కూడా అబద్ధం చెప్పేడు.

అయినా తను అడిగితే మధు డబ్బు యిస్తాడు. కానీ తను అడగడు గాక అడగడు. ఆతనివద్దనుంచి డబ్బు తీసు కోడు గాక తీసుకోడు. పరీక్ష పోతే పోనియ్—

'త్వరగా తెమలరా నా తండ్రీ. నిన్ను కాలేజీదగ్గర 'డ్రాప్'చేసి నేను మరో చోటికి వెళ్ళాలి' శ్రీధర్ డ్రస్ చేసు కొంటుంటే తొందర పెట్టాడు మధు.

'కాలేజీ ఎగ్గొట్టి ఎక్కడికెళ్ళాలి?' రూమ్ తలుపు తాళంవేస్తూ అడిగాడు శ్రీధర్.

'ఒరేయ్ శ్రీధర్. నీ కిలాంటి విష యాలు యిష్టంవుండవని చెప్పలేదు. నే నొక అమ్మాయిని ప్రేమించాను. చిత్తోడ్ రాణీ పద్మినీదేవి, జూలియట్‌లు, క్లియో పాత్రలు ఆమె అందంముందు బలాదూర్ అనుకో. యివాళ ఆమెకు నా ప్రేమను చెప్పి, ప్రేమకానుక యిచ్చి,ఆమె ప్రేమను పొందటానికి ముహూర్తం—'

'ఆమె నిన్ను ప్రేమిస్తుందన్న నమ్మకం నీకుందా? ఆమె అందాన్ని గురించి అంతగా పొగుడుతున్నావ్ కదా?'

'ఆమెతో పోలిస్తే నేను పెద్ద అంద గాడిని కాకపోవచ్చురా. కానీ నేను ధన వంతుడిని. ఆమే ధనవంతుల బిడ్డ—'

'అయితే?'

'అయితే ఏముంది? ధనవంతుల బిడ్డలు ధనవంతుల్నే ప్రేమిస్తారు కానీ బీద వాళ్ళను ప్రేమించరు కదా? అది రూలు. కనుక ఆమె నన్ను తప్పక ప్రేమిస్తుం దని నా విశ్వాసం. దట్సాల్—' గట్టిగా నొక్కి కిక్‌కొట్టి స్కూటర్ స్టార్ట్‌చేస్తూ అన్నాడు మధు.

నివ్వెరపోయాడు శ్రీధర్.—

'ఎక్కవేరా. క్విక్....'

'నేను బస్సులో వెళ్తానులే మధూ. నువ్వు పనిమీద వున్నావు కదా...వెళ్ళిరా. విష్‌యు ఆల్ ది బెస్ట్. కానీ పరీక్షలు దగ్గరకొస్తున్నాయని గుర్తుంచుకో—'

'పరీక్షలు యీ సంవత్సరం కాక పోతే వచ్చే సంవత్సరం పాస్ కావచ్చు శ్రీధర్. కానీ ప్రేమించిన స్త్రీ యొక్క ప్రేమను పొందే అవకాశం ఒకసారి పోగొట్టుకొంటే మళ్ళీ రాదుకదా?'

స్కూటర్ ముందుకు దూసుకు పోయింది.

• • •

పరీక్ష ఫీజు కట్టటానికి ఆవేళ ఆఖరి రోజు.

శ్రీధర్ ఆ సంవత్సరానికి పరీక్షపైన ఆశ వదులుకొన్నాడు.

ప్రేమకోసం మధు పరీక్షను మరుసటి సంవత్సరానికి పోస్ట్‌పోన్ చేస్తానన్నాడు. మరి తను? పరువుకోసం. బీదవారి ఆత్మాభిమానాన్ని నిలపటంకోసం పరీక్షను మరుసటి సంవత్సరానికి పోస్ట్‌పోన్ చేస్తే ఏం?

ఆ ఆలోచన క్షణమాత్రం పూరటను కల్గించేది. మరుక్షణం వాస్తవం గుర్తుకొచ్చేది. వెన్నుతట్టి 'నన్ను మర్చిపోకు' అని చెప్పేది.

ఒక సంవత్సరం పరీక్ష ఆలస్యమవుతే మధుకు నష్టంలేదు మార్కెట్‌లో కట్నాల ధర పెరిగితే లాభమే వుండవచ్చు.

కానీ తను బీదవాడు. తనమీద ఓ కుటుంబం ఆధారపడి ఉంది. తను పరీక్ష పాస్ కావటం ఒక్క సంవత్సరం లేటయితే తన జీవితమే కొన్ని సంవత్సరాలు లేటుగా నడవవచ్చు. తనవల్ల తనే కాక కుటుంబ సభ్యులు కూడా బాధపడవల్సి వుంటుంది.

మూడురోజులు యీ ఆలోచనలమధ్య వూగిసలాడేడు.

యీ రోజు ఫైనల్‌గా నిశ్చయించుకొన్నాడు.

తను పరీక్ష ఎలాగైనా యీ సంవత్సరమే పాస్‌కావాలి. పరీక్షఫీజు యీరోజే కట్టేయాలి. రాజ్యాలను కోల్పోవచ్చు కాని కాలాన్ని కోల్పోరాదు.

కానీ ఎలా?

యీ నాలుగురోజులుగా మధు రూమ్‌కి రావటంలేదు. కాలేజీలో కన్పించడం లేదు. ఇంటికివెళ్ళి వాకబుచేస్తే అక్కడవాళ్ళకి అతని జోగట్టా తెలియదు.

ప్రేమలోనే యింకా తిరుగుతున్నాడా? ఆమె ఎవరో అతని ప్రేమను అంగీకరించి వుంటుంది యిద్దరూ కల్సి సినిమా హీరో హీరోయిన్లులాగా కొండలమీద, గుట్టలమీద, నదుల్లో పడవలమీద, పార్కుల్లో, గుళ్ళల్లో పాటలు పాడుకుంటూ తిరుగుతున్నారేమో!

ఎలాగైనా తనే అతడిని వెతికి పట్టుకోవాలి.


శ్రీధర్ డ్రస్‌చేసుకొంటున్నాడు.

'పోస్ట్!'

కవరు చించి చూచాడు. తన పేరిట పరీక్షఫీజు కట్టిన చలాన్ రసీదు. దానితో పాటు ఓ వుత్తరం.

నా అభిమాని శ్రీధర్‌గారూ,

మీ తెలివితేటల్ని, మంచితనాన్ని ఆరాధించే అభిమానిని నేను. కనుక మిమ్మల్ని గురించిన సకల విషయాలు తెల్సుకోవటం సహజమే కదా? మనిషి మేధాసంపదకు, మంచితనానికి, బీదరికం ఓ శాపం కాకూడదు. మీ అభివృద్ధికి మీ ఆర్థికస్థితి పెద్ద మేకు కారాదు.




అందుకే యీ పని చేయటానికి సాహసించాను. మీ ఆత్మాభిమానాన్ని నేను గౌరవిస్తాను. అయితే మీపట్ల నాకు గల అభిమానాన్ని కూడా మీరు గుర్తించాలి గదా? సహృదయతతో నా వేదనను అర్థం చేసుకొంటారని ఆశిస్తూ—మీ అభిమాని.

ఆలా ఆ వుత్తరాన్ని చదువుతూ వుండిపోయాడు శ్రీధర్.

ఆనందం వల్లో, విచారంవల్లో అతనికి తెలీదు - కానీ అతని కళ్ళు నీటిపూడలయ్యాయి!

* * *

మధు గుండె పరాభవాగ్నితో జ్వలిస్తోంది.

అఫ్టరాల్ - వో స్త్రీ - తన ప్రేమను తిరస్కరిస్తుందా?

తన విలువ ఈరోజు కొన్ని లక్షలలో వుంటుంది. ఆ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సు కాస్త అయిపోతే యింకా పెరుగుతుంది.

అలాంటి తను - ప్రేమించి, కానీ కట్నం లేకుండా పెళ్ళిచేసుకొంటానంటే వో ఆడపిల్ల నిరాకరించటమా?

తన ప్రేమను, ఎంత ఖరీదైన వస్తువును బహుమతిగా యిస్తూ ప్రకటించాడు! నవరత్నాలు పొదిగిన వుంగరాన్ని బహూకరిస్తూ—

'పోనీ నా ప్రేమను నిరాకరిస్తే నిరాకరించారు. నేను ప్రేమగా యిస్తున్న యీ బహుమతినైనా స్వీకరించండి లతా ..'

'సారీ మిస్టర్. మీరెవరో నేనెవరో? మీరిచ్చే బహుమతిని నే నెందుకు స్వీకరిస్తాను? ఎలా స్వీకరిస్తాను! పర పురుషులిచ్చే బహుమతుల్ని స్వీకరించే స్త్రీలు మానసిక రోగులని నా వుద్దేశ్యం. బహుమతులిచ్చేవారు పెట్టే ఆకర్షణలకు లొంగే బలహీనులన్నమాట! దానంగా స్వీకరించటానికి నాకు ఆ అవసరం లేదు. మీరు

దానంగా యివ్వాలనుకొంటే చాలామంది అనాథస్త్రీలు ఉన్నారు లోకంలో_'

ఒకటి _ రెండు _ మూడు....

యిది సరిగ్గా పదోరోజు.

ఏం చూసుకొని లతకు అంత గర్వం? అందాన్ని చూసుకొనా?

అలా అనుకొన్నా తనేం కురూపి కాదే?

తనని ఎందుకు తిరస్కరిస్తున్నదో యీ రోజు తేల్చేయాలి.

బజార్లో కాదు. ఆమె యింట్లోనే_

'అమ్మాయిగారు కూర్చోమన్నారండీ. యిప్పుడే వస్తారు'

అయిదు నిమిషాల తర్వాత లత లోపలినుంచి రానే వచ్చింది.

మధును చూచి ఆశ్చర్యపోయింది. ఆమె ఎక్కడికో బయలుదేరటానికి సిద్ధమై వచ్చినట్లుంది.

'మీరా? యింటికి వచ్చారే? నాన్నగారితో మాట్లాడుదామనా?'

'మాట్లాడమంటే మీ నాన్నగారితో కూడా మాట్లాడుతాను. కానీ నాలో ఏం తక్కువని నా ప్రేమను నిరాకరిస్తున్నావు లతా నువ్వు?'

'ప్రేమించటానికి కారణాలు వుండలేనక్కర్లేనట్లే ఒక వ్యక్తిని ప్రేమించకపోవటానికి కూడా కారణాలు వుండనక్కర్లేదు మిస్టర్ మధూ. ప్రేమించని వాళ్ళందర్నీ ద్వేషిస్తున్నట్లు అర్థమూ కాదు.'

"నేను నీకన్నా ధనవంతుడిని. మాకు నాలుగు బంగళాలు, అయిదు కార్లున్నాయి"

ఆమె వచ్చి తండ్రిని పిలిచింది.

'నాన్నగారూ. యితను ధనవంతుల అబ్బాయట. నన్ను ప్రేమించానంటున్నాడు. పదిరోజులక్రితం ఖరీదైన బహుమతి కూడా యివ్వబోయాడు. ఆ రోజు నుంచి రోజూ నావెంట బడుతున్నాడు కానీ నేను యితడిని ప్రేమించలేదు. యూనివర్సిటీ కేంపస్‌లో వున్న వేల విద్యార్థులలో యితను నా దృష్టిలో ఒక విద్యార్థి. ఆతడి డబ్బును చూచి నన్ను ఆతడిని పెళ్ళిచేసుకోమని తండ్రిగా మీరు నన్ను శాసిస్తారా? మీ శాసనానికి నేను తలవొగ్గుతానని మీకు తెల్సు కదా?'

'అదేమిటమ్మా? నువ్వేం చిన్నపిల్లవా? ఆలోచనలు, అభిరుచులు లేనిదానివా? నీ పెళ్ళి_నీ యిష్టం_ అని ఎప్పుడో చెప్పానుగా? నీ భర్త _ నీ సహచరుడు_ను నిర్ణయించుకొనే బాధ్యత నీదే. అందులో ఎవరి ప్రమేయాన్ని నేను సహించను.'

ఆయన ఆ మాటల్ని అనేసి వెళ్ళిపోయాడు.

'నా కిప్పుడు అనిపిస్తోంది మిస్టర్. ధనవంతులు కావటం. పైపెచ్చు ధనవంతులమన్న స్ఫురణ మీ కుండటమే నా దృష్టిలో మీకున్న అనర్హతలలో ఒకటేమో? గుడ్ బై ఫర్ ఎవ్వర్_'

ఆమె లేచి బయటికి వచ్చింది. అతనూ లేచి బయటికొచ్చాడు.

ఆమె తనకోసం ఎదురుచూస్తున్న కారును ఎక్కింది.

కారు కదలబోతుండగా మధు తన జేబులోనుంచి నవరత్న ఖచితమైన బంగారు వుంగరాన్ని బయటకి తీసేడు. గురిచూసి ఆమెవైపు విసిరేడు.

తెరిచివున్న విండోనుంచి అది దూసుకెళ్ళి ఆమె నుదుటి పైభాగంలో తగిలింది.

'డ్రైవర్. కారు పోనియ్' అంది లత కాస్తంతన్నా తొణుక్కుండా.

* * *

శ్రీధర్ ఆమె వెనుక కారు దిగేడు.

ఆమె చేతులు జోడించి నమస్కరించింది.

'నన్ను ఇవాళ మీరు అదృష్టవంతుల్ని చేశారు. అందుకు ఎన్నో విధాల కృతజ్ఞతల్ని తెల్పుకొనే సమయం ముందెంతో వుంది. కనుక మాటల్లో చెప్పను. మా నాన్నగారు రేపే వచ్చి మీతో లాంఛనప్రాయంగా మాట్లాడుతారు. వివాహవిషయాలు పెద్దలకు సంబంధించినవి. కనుక వివాహం అయిందాక మిమ్మల్ని నేను కాని, నన్ను మీరు కాని ఏకాంతంగా కల్సుకోవాల్సిన అవసరం లేదనుకొంటాను. ఆ శుభ ఘడియకొరకు ఎదురుచూస్తుంటాను. అంతవరకు శలవా మరి?' అని అందామె.

ఆరాధనాభావంతో ఆమెవైపు చూచాడు శ్రీధర్. తలాడించాడు.

ఆమె సిగ్గుతో తలవంచుకొని వెనక్కి వెళ్ళిపోయింది.

ఒక్కసారిగా అతని హృదయం అదో విధమైన తన్మయభావంతో నిండిపోయింది.

యిదంతా కలా? నిజమా?

ఆమెది తన క్లాసు కాదు. కోర్సు కాదు.

అయినా ఆమెకు తనని గురించి సకల సమాచారం తెల్సు. తనని చాలా రోజులుగా మౌనంగా ఆరాధిస్తోందిట.

'మీరు ధనవంతులు లాగ కన్పిస్తున్నారు. నేను బీదవాడినని తెల్సు. ధనవంతులు ధనవంతుల్నే ప్రేమిస్తారు కదా? మీరు నన్నెందుకు ప్రేమిస్తున్నారు?' కావాలనే అడిగాడు తాను- అంతా విని,

'ధనవంతులు ధనవంతుల్నే ప్రేమించాలన్న రూలుందేమో నాకు తెలియదు. అలాంటి నియమమే వుంటే- మేధావుల్ని మేధావులు ఆకర్షించాలి. మంచివారు మంచివారిని ఆకర్షించాలి కదా? నేను మీ మేధస్సుకు, మంచితనానికి లొంగిపోతున్నాను. మీరు బీదవారుగా నా కళ్ళకెప్పుడూ కన్పించలేదు. చాలామంది ధనవంతులకన్నా మీరు ఐశ్వర్యవంతులుగా నా కళ్ళకు కన్పిస్తున్నారు.'

అలాంటి అనుభూతుల్ని పొందగల హృదయంవున్న స్త్రీయొక్క ప్రేమను పొందటం ఎంత అదృష్టం.

ప్రేమించటం అన్న తీపి అనుభూతి తనకు లేదు.

కాని ప్రేమించటం అన్న అనుభూతిలో ఎంత మధురిమ వుంది?

'నాకు ధనసహాయం చేసిన 'అభిమాని' మీరేనా?'

'మీ అభిమానిని కావచ్చు. కాని మీకు సాయం చేయగలిగిన శక్తి నాకుందని నే ననుకోను. ధనం జ్ఞానికి సేవచేస్తుంది. అజ్ఞానిని శాసిస్తుంది.'

ఆమెను ప్రేమించగలడు తను. ఆమెతో జీవితాన్ని పంచుకోగలడు. తను ఆచరించవల్సిన ధర్మాలను ఆమె సహకారంతో ఆచరించగలడు. సాక్షాత్తూ ఆమె తన సహధర్మచారిణి కాగలదు.

'కోరుకొన్న భర్త దొరకడం స్త్రీకి ఎంత అదృష్టమో, మనసెరిగిన భార్య లభించడం పురుషుడి క్కూడా అంత అదృష్టమే. మిమ్మల్ని నేను హృదయ పూర్వకంగా ప్రేమించగలను....'

కల కాదిది. మధురమైన వాస్తవం.

త్వరలో తనూ ఆమె భార్యాభర్తలు కాబోతున్నారు. మనసా వాచా కర్మణా ఆమె తన జీవితాన్ని పంచుకోబోతున్నది.

యీ వార్తను తనొక్కడూ యిక భరించలేడు. ఎవరికైనా చెప్పుకోవాలి. కానీ ఎవరు? ఎవరికి చెప్పాలి? ఎవరా ఆత్మీయుడు?

మధు!

ఎన్నడూ లేనిది మధు యిన్నిరోజులుగా తనకి కన్పించలేదు. ఒకటి రెండు సార్లు స్కూటర్‌మీద వెళ్తూ కన్పించినా తనతో మాట్లాడలేదు. తనని చూచాడో లేదో? తను పిల్చినా స్కూటర్ ఆగకుండా పోయింది. అతనింటికి ఎప్పుడు వెళ్ళినా వుండడ. ఎన్ని చీటీలు రాసిచ్చి వచ్చినా తన గదికి రాలేదు. అలా అతడిని కల్సుకొనే ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి.

యివాళ ఎలాగైనా, ఎంత రాత్రయినా అతడిని పట్టుకోవాలి.

రూమ్‌లోకి ప్రవేశించనన్న ప్రవేశించకుండా అతను అటునుంచి అటే మధు యింటికి బయలుదేరాడు.

* * *

అమ్మయ్య! మధు యింట్లోనే వున్నాడు.

కాని అదేమిటి? అలా వున్నాడేం? కొంపతీసి ప్రేమశాస్త్రా పెడిసికొట్టలేదు కదా? చెడిరిన క్రాపు, ఎర్రబడ్డ కళ్ళు....

'అదేమిటి మధూ? అలావున్నావేంటి? ఏం జరిగింది?'

మధు శ్రీధర్ మొహంలోకి సూటిగా కాసేపు చూచాడు.

'నా సంగతి అలా వుంచు. కాని నీ

సంగతి చెప్పు ముందు. నీకేమయింది. నువ్వు అలా వున్నావేంటి?

'ఎలా వున్నాను?' ఆశ్చర్యపోతూ అడిగాడు శ్రీధర్.

'తెలీదా? అయితే అద్దంలో చూచుకో. మొహంలో ఆ కళ - ఆ తన్మయత్వం- ఆనందం.... నోబెల్ బహుమతి వచ్చినప్పటి శాస్త్రజ్ఞుడిలా వున్నావు.

అంటే - తన మనసులో ఆనందం మొహంలో అంత ప్రస్ఫుటంగా కన్పిస్తున్నదన్నమాట! శరీరాన్ని శాసించగల శక్తి మనసుకుంది. మనోధర్మాన్నిబట్టే శరీరధర్మం పనిచేస్తుంటుంది ఆ లెక్కన మధును భగ్నప్రేమికుడే అనుకోవాలా?

అలాంటి మనోస్థితిలో వున్న మిత్రునికి తన ప్రేమకథను చెప్పటం సమంజసమా?

కాదు. కానీ మధు అల్సేషన్ కుక్కలాంటివాడు. వాసనచూసి పసిగట్టగలడు. అంతు చూచిందాకా వదలడు. అది అతని స్వభావం. అతని దగ్గర దాచి ప్రయోజనం లేదు. కాగా తన ప్రేమకథ విని అతను మానసికంగా కొంత వూరట చెందవచ్చు కదా? స్నేహ ధర్మం అసూయచెందటం కాదు కదా? ఆనందించటం-

జరిగిందంతా చెప్పాడు శ్రీధర్.

'కంగ్రాచ్యులేషన్స్. వో యింటివాడివి కాబోతున్నావన్నమాట.'

'కానీ.... నీ ప్రేమ ఏమయింది?'

'ప్రేమకేం? బాగానే వుంది. కానీ అది వొట్టి దౌర్భాగ్యపుముండ. కట్నం పైసా ఖర్చుకాకుండా వస్తు కొట్టేద్దామనుకొంది. కానీ కట్నంరాని ప్రేమనా కెందుకు? ఆ పిసినారిముండను మనసులో చంపేశాను.'

అతనా మాటలన్న ధోరణి చూడగానే శ్రీధర్‌కు భయంవేసింది. యిక ఆ విషయంలో అతడిని కదిలించటం అనవసరం

'వస్తారా యింత పొద్దుపోయింది.' అంటూ లేచాడు శ్రీధర్.

'యిప్పుడెలా వెళ్తావ్ రూమ్ కి? నే నొచ్చి డ్రాప్‌చేస్తా నుండు' అని అనలేదు మధు.

'నాకు నిద్రవస్తోంది. నేమా పడుకొంటాను' అంటూ రూమ్ బయటకు సాగనంపటానికన్నట్లు లేచాడు మధు. శ్రీధర్ రూమ్ దాటేడు.

'యింతకీ నన్ను వలచివచ్చిన ఆ అమ్మాయి పేరేమిటో చెప్పేవు కాదురా?' రూమ్‌డోర్ పట్టుకొని అడిగాడు మధు.

'ఆ అమ్మాయి పేరు మాధవీలతరా. వస్తాను. గుడ్‌నైట్....'

తనవెనుకే తలుపు మూసుకొన్నదనీ, రూమ్‌లో వస్తువులు కొన్ని పగిలిపోయాయనీ, లైటు ఆరిపోయిందనీ శ్రీధర్‌కి తెలియదు.

* * *

శ్రీధర్ పెళ్ళి శుభలేఖ—

పడగవిప్పి నాట్యంచేస్తున్న నాగు పాములా టేబిల్‌మీద ఫ్యాన్‌గాలికి ఎగిరెగిరి పడ్తోంది.

మధు హృదయం లావాతో నిండి వుంది. రక్తం విషంగా మారింది.

తనని తిరస్కరించిన లత శ్రీధర్‌ను గాఢంగా ప్రేమించింది. మరో పది రోజుల్లో దాని ప్రేమ ఫలించబోతున్నది. శ్రీధర్‌ని భర్తగా పొందబోతున్నది.

తనని అంత అవమానించిన అడది తన ఎదుటే ఆనందించటమా?

తన ప్రేమను తిరస్కరించిన స్త్రీ తన స్నేహితుడి ప్రేమను పొందటమా?

నో. తనకు దక్కని ప్రేమ దానికి దక్కకూడదు.

అదీ తనలాగే భగ్నప్రేమికురాలు కావాలి. అప్పటికికాని దానికి బుద్ధిరాదు. అది ఏడుస్తుంటే కాని తన హృదయం శాంతించదు.

అందుకే యీ రోజు మరో గంటకు శ్రీధర్‌ను 'అక్కడి'కి రమ్మని కోరేడు తను.

ఆతను తండ్రిపేర లైసెన్సువున్న పిస్టలులో తూటాలను అరేంజ్‌చేసి సంతృప్తిగా నిట్టూర్చాడు.

శ్రీధర్ మంచివాడే. స్నేహపాత్రుడే. ఎంత స్నేహపాత్రుడు కాకపోతే తను ఎక్కడికో రమ్మనగానే ఎందుకని అని అన్నా అడగకుండా వస్తానని అంగీకరిస్తాడా?

అతనంటే తనకు జాలి. పేదవారిపట్ల జాలిచూపడం తనకు సర్దా.

అతడిని తను పరీక్ష పాస్‌కావడానికి వుపయోగించుకోవాలనుకొన్నాడు. కానీ యిప్పుడు లతపై తన పగను తీర్చుకోటానికి వుపయోగించుకోబోతున్నాడు.


ఫూర్‌ఫెలో. లతప్రేమను పొందటం తన అదృష్టం అనుకొంటున్నాడు. కానీ అది ఎంత దురదృష్టమో అతనికి తెలియదు.

లత కాలనాగు.

తన ప్రేమను తిరస్కరించి తనను కాటువేసింది. ప్రేమించి, శ్రీధర్‌ను మరో రూపంలో కాటువేయబోతోంది.

తను కేవలం నిమిత్తమాత్రుడు. శ్రీధర్‌కు జరగబోయేదానికి బాధ్యురాలు లతే. లత శ్రీధర్‌ను ప్రేమించక పోయినా, శ్రీధర్ లత ప్రేమను తిరస్కరించినా తనకీ ఆలోచన వచ్చేది కాదు కదా?

మధు పిస్టల్‌ని జేబులో పెట్టుకొన్నాడు. అది తన తండ్రి ఆత్మరక్షణకోసం, లైసెన్సుపొంది బీరువాలో భద్రపర్చుకొన్న పిస్టల్. దానిని వుపయోగించుకోవాల్సిన అవసరం ఇన్నాళ్ళయినా ఆయనకి కలగలేదు. కానీ యివాళ అది తన అభిమాన రక్షణకొరకు, ప్రేమ ద్వారా




పోయిన పరువును, ద్వేషం ద్వారా తిరిగి ప్రతిష్ఠించుకోటం కొరకు వుపయోగపడ బోతోంది.

అతను చేతిగడియారం చూచు కొన్నాడు.

లత గుండెల్ని బద్దలుచేసి ఏడిపించే ముహూర్తానికి యింకెంతో వ్యవధి లేదు. అతను బయటికొచ్చి స్కూటర్ ఎక్కాడు.

* * *

కొండలు....చెట్లు.... మధ్యలో వో చిన్న లోయ- ఆ లోయగుండా ప్రవహిస్తున్న పిల్ల ఏరు .... ఎటు చూచినా నిశ్శబ్దం....

అటు అస్తమిస్తున్న సూర్యుడు-

సినిమా షూటింగ్‌కి పనికివచ్చే సెట్టింగ్.

కానీ యిక్కడ జరగబోయే షూటింగ్ మరొకటి....

మధు టైమ్ చూచుక్కొన్నాడు. యింక సరిగ్గా అరగంట వ్యవధే వుంది. శ్రీధర్ ఎందుకోననుకొని అప్పుడు ఆదుర్దాగా ఉత్సుకతతో వస్తాడు. వన సీమలో పిస్టల్ చూస్తాడు. విస్తుబోతాడు. అతడిని చూచి తను నవ్వుతాడు - సాధ్యమయినంత జాలిగా.

'మిత్రమా శ్రీధర్. నీ దోషం యీ నాటకంలో ఏం లేదు. నువ్వు యిప్పటికే హీరోవి. కాకపోతే లత నిన్ను అంత గాఢంగా ప్రేమించటం నీ పూర్వజన్మ దుష్కృతం. పిరికంతో వున్న నీకు నేనెంతో సహాయం చేసేను. ప్రతిఫలంగా నా ఆనందంకోసం నిన్ను చంపుతున్నాను. నాకు దక్కని ప్రేమ నీకు దక్కితే నేను భరించగలనా? అందుకే ... అందుకే....'

అప్పుడు జరగబోయేది వూహించి శ్రీధర్ భయంతో వెనక్కి తిరిగి పారిపో బోతాడు. తను జేబులోనుంచి పిస్టలును యిలా తీసి వికృతంగా నవ్వుతాడు.

'మిత్రుడా. నువ్వెక్కడికీ పారిపో లేవు. పిస్టల్‌ని గురిచూచి కాల్చటం నాకు చాతకాదనుకొంటున్నావా? లేక యిది నాటకాలలో వుపయోగించే పిస్టల్ అను కొంటున్నావా? కావాలంటే చూడు....'

యిలా వూహించుకొంటున్న మధు హఠాత్తుగా వులిక్కిపడ్డాడు. అవును తను వూహించినట్లే జరిగితే- శ్రీధర్ పారిపో కోతే - తను గురిచూచి కాల్చిపారేయ గలదా? అసలా పిస్టల్ తను ట్రిగ్గర్ నొక్కగానే పేలుతుందా? ఎప్పటిదో తుప్పుపట్టి లేదు కదా?

శ్రీధర్ వచ్చేలోగా వొక్కసారి టెస్ట్ చేసుకొంటే బాగుంటుంది కదా? యస్. యస్.... వెరీగుడ్ అయిడియా... అసలే వాడకంలోలేని పిస్టల్ యిది. పైగా తనకీ కాలక్షేపం కూడా అవుతుంది.

* * *

శ్రీధర్ బస్సు దిగి వాచీ చూచుకొన్నాడు. యింకా అరగంటకు పైగానే టయిమ్ వుంది. అనుకొన్నదానికన్నా తిన్నంగా బస్సులు చకచకా దొరకటం వల్ల, అరగంట ఆలస్యంగా చేరతానను కొన్న తను, అరగంట ముందే చేరు కొన్నాడు. అదిగో - అదే స్పాట్... కొండపైన.... అక్కడికే మధు తనను రమ్మంది.

అయినా, యిక్కడికి, యీ సమయంలో, తనని వొంటరిగా ఎందుకు రమ్మన్నట్లో?

మధు తనతో ఈ మధ్య అదోలకంగా వుంటున్నాడు. పెళ్ళి శుభలేఖ యిచ్చిన రోజున కూడా అతని మొహంలో తెచ్చి పెట్టుకొన్న కృత్రిమపు నవ్వే- మనసు విప్పి మాట్లాడుతున్నట్లు కన్పించదు.

ఎంత ప్రయత్నించి అతని మనసును తెల్సుకోలేకపోయాడు తను.

పెళ్ళినాడు లతకు మధును పరిచయం చెయ్యాలి.

క్షణంలో అతడి మనసును చీల్చేసి విశ్లేషించి చెప్తుంది.

లత....లత....లత... ఎంత గొప్ప అందగత్తె.... తెలివిగలది....మంచిది... వుదాత్తమైన ఆలోచనలు కలది...ఆమె..

'ఢాం....'

ఉలిక్కిపడ్డాడు శ్రీధర్.

యీ నిర్జనప్రదేశంలో పిస్టల్ పేల్చిన చప్పుడు. తను, మధు కాక మరెవరన్నా వున్నారా యిక్కడ- యీ సమయంలో?

ఒక్కక్షణం ఆలోచించి శ్రీధర్ ఆ శబ్దం వినవచ్చిన వైపుకు వడివడిగా నడుచుకొంటూ వెళ్ళాడు.

కొనవూపిరితో కొట్టుకొంటున్న మధు- రక్తం....రక్తం...

'ఏమయింది మధూ? ఏమిటిదంతా?' అంటూ దగ్గరికెళ్ళి అతడిని పట్టుకొన్నాడు. చుట్టూ చూచాడు. అక్కడ మరెవరూ వున్న అలికిడివిన్పించలేదు. మరి మధును ఎవరు కాల్చినట్లు?

అంతలోనే– మిత్రుడు చావుబ్రతుకులలో ఉన్నాడని, ముందు అతనికి మెడికల్ ఎయిడ్ అవసరం అన్న స్ఫురణ వచ్చింది అతనికి.

'హాస్పిటల్‌కి తీసుకెళ్తాను మధూ. కొండక్రింది రోడ్డుదాకా నిన్ను మెల్లగా ఎత్తుకొని పోతాను. ఆలస్యం చేస్తే ప్రమాదం.'

శ్రీధర్, మిత్రుడి రెండుచంకలక్రింద చేతులువేసి లేవనెత్తబోయాడు. కానీ మధు, అతని చేతుల్ని పట్టి లాగి తన పక్కన కూర్చోపెట్టుకొన్నాడు. శ్రీధర్ రెండు అరచేతుల్ని తన చేతుల్తో పట్టుకొన్నాడు. అతని రెండుకళ్లు అత్యంత దీనంగా చూస్తున్నాయి.

అతనేదో చెప్పాలనుకొంటున్నాడు. చెప్పలేకపోతున్నాడు.

చివరికి శక్తినంతా పెకలించుకొన్నాడు.

అతని కళ్ళనుంచి రెండు నీటి చుక్కలు రాలి శ్రీధర్ చేతిలో పడ్డాయి. తలఎత్తి ఏదో మాట్లాడబోయాడు.

ఊహు.... సాధ్యంకాలేదు.... తల వాలిపోయింది. అతను కార్చిన కన్నీటిలోనే పడి తడిపింది.

శ్రీధర్‌కు షాక్ తిన్నట్లయింది!

ఏమయింది మధుకు? ఎలా చనిపోయాడు? ఎందుకు చనిపోయాడు? యీ చావును చూపటానికేనా తనని యిక్కడికి రమ్మంది.

అతడిని ఎవరైనా హత్యచేశారా? లేక అతనే ఆత్మహత్య చేసుకొన్నాడా?

భగవంతుడా ఏమిటీ వైపరీత్యం? నీ లీల?

యిలా ఆలోచిస్తూ శోకించసాగాడు శ్రీధర్.

కానీ....

తనని చంపటానికి ఉద్దేశించిన పిస్టల్ ట్రయిల్‌రౌండ్‌లో బేక్‌ఫైర్ అయి మధునే పొట్టన పెట్టుకొందని, ధనహంకారం అతడిని బలిగొన్నదన్న ఊహైనా అతనికి రాలేదు.

యిక అనుమానానికి ఆస్కారం ఎక్కడుంది?

మిత్రుడు శవాన్ని భుజాన వేసుకొని మెల్లగా కొండదిగి కింపికి బయలుదేరాడు శ్రీధర్.

చిత్రం! రోడ్డుమీద కారులో మాధవీలత!

'పెళ్ళికి ముందే మీ ఐదువు పంచుకొందామని వచ్చాను' అంది ఆమె తల వంచుకొని.